డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 8: వర్షాకాలం నేపథ్యంలో డెంగీ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. గురువారం మహబూబ్‌నగర్‌లో డెంగీ ప్రభావిత ప్రాంతాలను ఆకస్మికంగా పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు పడుతు న్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభించేందుకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ముఖ్యంగా డెంగీ కేసులు పెరిగే అవకాశం ఉన్నందునా దవాఖానల్లో వసతులు, మందుల లభ్యతపై వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోజువారీ కేసులను రిపోర్టు చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. విపరీతమైన జ్వరం, నిరంతరం తలనొప్పి, కళ్లల్లో, కనురెప్పల చుట్టూ నొప్పి, ఒళ్లునొప్పులు, మంటతో కూడిన కీళ్లనొప్పులు, అనారోగ్యానికి గురైన కొద్ది రోజుల్లో దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం దవాఖానకు వెళ్లి వైద్యులతో పరీక్ష చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. నిరంతరం వాంతులు, చిగుళ్లలో రక్తస్రావం, కడుపునొప్పి తదితర అంశాలపై ఏ మాత్రం నిర్లిప్తత ప్రదర్శించొద్దన్నారు. దోమల నుంచి శరీరాన్ని కాపాడుకోవాలని, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అంతకుముందు కలెక్టర్ కోయనగర్, శేషాద్రినగర్, అయోధ్యనగర్ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా చేపట్టిన వివిధ రకాల కార్యక్రమాలు తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో డెంగీ కేసు నమోదు, జ్వరపీడితులు, ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో వివరాలు సేకరించారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ డా.మహేశ్వర్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి భాస్కర్, రాజగోపాలచారి, వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శేషాద్రినగర్ కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

పునరావాస సమస్యలు పరిష్కరిస్తాం

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

భూత్పూర్‌లో రిజర్వాయర్ నుంచి వచ్చే ఊట నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్

మక్తల్, ఆగస్టు 8: మక్తల్ మండలంలో ముంపునకు గురైన గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి కలెక్టర్ భూత్పూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూత్పూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో రిజర్వాయర్ నుంచి వచ్చే ఊటనీటి వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తాయని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా, కలెక్టర్ స్పందిస్తూ భూత్పూర్ రిజర్వాయర్ పనులు పూర్తయ్యి 20ఏండ్లు గడిచిందని, సమస్య పరిష్కారం కాకుండా అలాగే ఉందని, ముంపునకు సంబంధించిన పాత ఫైల్‌ను చూసి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. గ్రామంలో మురుగులేకుండా చూడాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. జూరాల ప్రాజెక్టు ముంపు గ్రామాలైన అనుగొండ, అంకన్‌పల్లి, గడ్డంపల్లి, దాదనపల్లిలో కలెక్టర్ పర్యటించి, గడ్డంపల్లి రైతువేదిక వద్ద కలెక్టర్ మొక్కలు నాటారు. అంతకుముందు మక్తల్ మినీ ట్యాంక్ బండ్‌పై మున్సిపల్ దుకాణ సముదాయ నిర్మాణం కోసం ఎమ్మెల్యేతోపాటు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్, ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

మక్తల్, ఆగస్టు 8 : మున్సిపాలిటీలోని వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. గురువారం మున్సిపాలిటీలోని 10వ వారు అంబేద్కర్‌నగర్‌లో ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. శబరికాలనీ, ఎల్లమ్మకుంట నుంచి మురుగు అంబేద్కర్‌నగర్ వైపు వచ్చి ఇండ్ల మధ్య నిలిచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

మూసాపేట, ఆగస్టు 8 : అడ్డాకుల మండలంలోని పెద్దమున్గల్‌చేడ్‌లో కొత్తగా నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వనపర్తి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

మూసాపేట, ఆగస్టు 8 : అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం అడ్డాకుల మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇండ్ల మధ్య మురుగు, కంపచెట్లు తొలగించాలని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అలాగే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగార్జున రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 8: బీసీ కుల గణన వెంటనే చేపట్టడంతో పాటు జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని బీసీ మేధావుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాండురంగం, ఎన్.ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని బీసీ స్టడీసర్కిల్‌లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన చర్చావేదికలో మాట్లాడారు. బీసీల జనాభాకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలన్నారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి

నవాబ్‌పేట, ఆగస్టు 8: మండలంలోని కొల్లూరులో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చందర్‌నాయక్, రాజు, వాసుయాదవ్, రఘు, గోపాల్‌గౌడ్, నర్సింహులు, కమలాకర్ పాల్గొన్నారు.

Before the Hon'ble Arbitrator / Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.124 of 2024
Between
NEESTHAM CHITS PVT LTD,
BR. Mahabubnagar. ...Disputant
And
Shanku Raju Kumar and others ...Opponents
NOTICE
To
4) Thokali Sony D/o T. Shanthaiah, aged 34 years, Occ: Lecturer at Telangana Social Welfare, Residential Degree College at Mahabubnagar town and district, R/o H.No. 2-76/1, Ramnagar street, Atmakur Vg & Mdl, Wanaparthy Dist.
....**Opponents**
Claim for Recovery of Rs. **2,99,180/-** (Rupees.Two Lakhs ninety nine thousands one hundred eighty Only)
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No.7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabubnagar on **24-08-2024** at **11-30A.M.** for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar
S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం: ఆర్ఎం

లక్కీడిప్ తీస్తున్న రీజినల్ మేనేజర్ శ్రీదేవి

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 8: ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే సురక్షితంగా తమ గమ్యాన్ని చేరుకోవచ్చని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రీజినల్ మేనేజర్ శ్రీదేవి లక్కీ డిప్ తీసి విజేతలను ప్రకటించారు. మహిళా ప్రయాణికులు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణిస్తే ప్రత్యేక గిఫ్టులు ఉంటాయన్నారు. ఇప్పటికే సూపర్ లగ్జరీలో ప్రయాణించిన భాగ్యలక్ష్మి, వీఎన్ చారి, అబ్దుల్ సత్తార్, అలాగే లగ్జరీ బస్సులో ప్రయాణించిన చంద్రకళా, సరస్వతి, లక్ష్మీ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు.

డయల్ 100 కాల్స్‌పై వెంటనే స్పందించాలి

- నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, ఆగస్టు 8: డయల్100 కాల్స్ పట్ల బ్లూ కోట్స్ సిబ్బంది వెంటనే స్పందించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో డయల్100 సేవల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి వెళితే నేరం తీవ్రత వీలైనంతవరకు తగ్గించవచ్చన్నారు. ఘటనా స్థలం వద్ద బాధితులకు న్యాయం చూకూరేలా విచారణ చేయాలని, సమస్య పెద్దది అయితే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు వినియోగించే ట్యాబ్‌లను 24గంటలు నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రి సమయాల్లో, పట్టణాల్లో గస్తీ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా పర్యవేక్షించాలన్నారు. వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు.

రిజర్వాయర్‌ను పూర్తిగా నింపాలి

మక్తల్, ఆగస్టు 8: చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపితే రెండు పంటలకు సాగునీరందే అవకాశం ఉందని మాజీ ఎంపీటీసీ బలరాంరెడ్డి అన్నారు. సంగంబండ పెద్దవాగుపై నిర్మించిన రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నింపాల్సి ఉన్నా, నింపకుండా అధికారులు నిర్లక్ష్యం వహిసున్నారని అన్నారు. చెరువులను నింపకుండా మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు కర్ణాటక ప్రభుత్వంతో, తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి, కర్ణాటకలో 150 ఎకరాల భూమిని సేకరించి చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువులకు నీళ్లు వదలకుండా దిగువకు నీటిని ఇలాగే వదలడం కొనసాగిస్తే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నష్టపరిహారం ఇప్పిస్తాం

భూత్పూర్, ఆగస్టు 8 : మండలంలోని వెల్కిచర్ల, మద్దిగట్ల గ్రామాలకు కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి వస్తున్న సాగునీటి కాల్వలో పొలం కోల్పోయిన రైతులు నష్టపరిహారం కోసం కాల్వను పూడ్చారు. దీంతో మద్దిగట్ల, వెల్కిచర్ల గ్రామాల చెరువులకు నీళ్లు రావడం నిలిచిపోయాయి. గురువారం మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి రైతులతో మాట్లాడుతూ నష్టపరిహారం విషయం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాల్వను తీసేందుకు రైతులు ఒప్పుకున్నారు.

పెచ్చులూడిన తాసీల్దార్ కార్యాలయం

- పగిడిమర్రి యువకుడికి గాయాలు

చికిత్స పొందుతున్న మహ్మద్‌హాజీ

ఊట్కూర్, ఆగస్టు 8: తాసీల్దార్ కార్యాలయం పైకప్పు పెచ్చులు ఊడిపడి యువకుడికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఊట్కూర్ మండల తాసీల్దార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం పోర్టికోలో నిలబడి ఉన్న పగిడిమర్రి గ్రామ యువకుడు మహ్మద్ హాజీపై పైకప్పు పెచ్చులు ఊడిపడడంతో తలకు గాయాలయ్యాయి. దీంతో అతనిని సిబ్బంది హుటాహుటిన చికిత్స కోసం స్థానిక దవాఖానకు తరలించారు. ఇదే సమయంలో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాఘవేంద్రారెడ్డి ద్విచక్ర వాహనంపై కూడా పెచ్చులు ఊడిపడటంతో బైక్ పెట్రోల్ ట్యాంకు పూర్తిగా ధ్వంసమైంది. కొద్దినెలలుగా పెచ్చులు ఊడి పడుతుండటంతో కార్యాలయంలో పని చేసేందుకు అధికారులు, సిబ్బంది నిత్యం భయంభయంగా గడుపుతున్నారు.

పూడ్చిన మృతదేహానికి శవ పరీక్ష

మద్దూర్ (కొత్తపల్లి), ఆగస్టు 8: పూడ్చిన మృతదేహానికి శవ పరీక్ష చేసిన ఘటన మద్దూర్ మండలంలో చోటు చేసుకున్నది. గురువారం ఎస్సై రామ్ లాల్ తెలిపిన వివరాలు.. మండలంలోని నందిపాహాడ్ గ్రామానికి చెందిన దిడ్డి కవితమ్మ అలియాస్ రాములమ్మ(42) జూలై 11న అనుమానాస్పదంగా మృతి చెందగా, ఇరు కుటుంబాల సభ్యులు కలిసి మరుసటి రోజు ఖననం చేశారు. తన చెల్లెలు మరణంపై అనుమానం ఉన్నదని మృతురాలి అన్న నర్సింహులు ఈనెల 6న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు గురువారం మృతదేహానికి స్థానిక ఎమ్మార్వో మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించారు. ఆపై ప్రత్యేకంగా మహబూబ్‌నగర్ నుంచి ఫోరెన్సిక్స్ నిపుణులను రప్పించి, శవ పరీక్ష చేసి మృతదేహాన్ని అందరి సమక్షంలో తిరిగి పూడ్చివేశారు. ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చిన తర్వాత కారణాలు తెలియజేస్తామని తెలిపారు.

కిష్టాపూర్‌లో మీసేవ కేంద్రం ప్రారంభం

ధన్వాడ, ఆగస్టు 8: మండలంలోని కిష్టాపూర్‌లో గురువారం మీ సేవ కేంద్రాన్ని పంచాయతీరాజ్ శాఖ ఏఈ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, కడపయ్య తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

కోయిలకొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్‌యార్డులో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 8 : పట్టణ వాసులకు పారిశుధ్య సేవలు విస్తరించాలని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ పురపాలిక కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో పారిశుధ్యంపై పాలమూరు పురపాలికలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమీక్షించారు. అంతకుముందు మహబూబ్‌నగర్‌లోని పలుప్రాంతాలను క్షేత్రస్థాయి లో పర్యటించి సంబంధిత అధికారులతో పారిశుధ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోయిలకొండ ఎక్స్ రోడ్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు, పట్టణంలోని 9, 12, 14,15, 21, 22, 27, 35 వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన పనులు సమీక్షించారు. పట్టణాల్లో ప్రతిరోజు చెత్త సేకరణ, తరలింపులో ఎదురవుతున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై ఆరా

భూత్పూర్, ఆగస్టు 8 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆరా తీశారు. గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ సురేందర్‌రెడ్డితో మాట్లాడారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అప్పంపల్లిలో పర్యటిస్తున్న ట్రైనీ కలెక్టర్

మరికల్, ఆగస్టు 8 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ట్రైనీ కలెక్టర్ గరిమానురుల్లా అన్నారు. గురువారం మండలంలోని అప్పంపల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అలాగే ప్రాథమిక పాఠశాల, పల్లె దవాఖన, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ గరిమానురుల్లా మట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో పావని, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు పాటుపడుదాం

దేవరకద్ర, ఆగస్టు 8 : స్వచ్ఛతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపల్లిలో మొక్కలు నాటి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), ఆగస్టు 8 : స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తా సీల్దార్ ఎల్లన్న అన్నారు. గురువారం కౌకుంట్ల మండలం పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుతతో కలిసి మొక్కలు నాటారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, ఆగస్టు 8 : వానకాలంలో వచ్చే సీజన ల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ జొన్నల అనిత తెలిపారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించా రు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, వార్డు ఆఫీసర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మిడ్జిల్, ఆగస్టు 8: ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని డాక్టర్ శివకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

జడ్చర్ల, ఆగస్టు 8: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి రోగాల బారిన పడే అవకాశం ఉండదని జెడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి అన్నారు. జడ్చర్ల మండలంలో ఆమె పర్యటించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

కాంగ్రెస్ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు గురువారం నిరసన తెలిపారు.

– నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ ఆగస్టు 8

హామీలను వెంటనే అమలు చేయాలి

భూత్పూర్, ఆగస్టు 8 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఎస్సీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దళితమోర్చ పిలుపు మేరకు మండలంలో డిప్యూటీ తాసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేశారు. గురువారం దళితమోర్చ పట్టణ అధ్యక్షుడు రాము మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ అభయ హస్తం పేరుతో రూ.12లక్షలు, బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు, ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్లకు ఏటా రూ.750కోట్లు కేటాయిస్తానని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. హామీలను నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

ఊట్కూర్, ఆగస్టు 8: ఊట్కూర్ మండలం ఎర్గట్‌పల్లికి చెందిన అభిషేక్ (19) ఇదే గ్రామంలో నివాసముంటున్న చిన్నమ్మ, సుజాతతో బైక్‌పై గురువారం మధ్యాహ్నం నారాయణపేటకు బయలు దేరాడు. సింగారం చౌరస్తాకు కొద్ది దూరంలో అడ్డంగా వచ్చిన ఎద్దులను తప్పించబోయి బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. సుజాత కూడా తీవ్రంగా గాయపడడంతో పరిస్థితి విషమంగా మారింది. చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పేట పట్టణ పోలీసులు సందర్శించి కేసు నమోదు నమోదు చేశారు.

మొక్కలు నాటిన వైద్య సిబ్బంది

దామరగిద్ద, ఆగస్టు 8: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ప్రభుత్వ దవాఖాన డాక్టర్ ఐశ్వర్య ఆధ్వర్యంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ కిష్టమ్మ, ఏఎన్ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన

ధన్వాడ, ఆగస్టు 8: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అంటువ్యాధులపై ఎంపీడీవో సాయిప్రకాశ్ అవగాహన కల్పించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

ధన్వాడ, ఆగస్టు 8: మండలంలోని రామకిష్టయ్యపల్లిలో గురువారం విగ్రహప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. రూ.18లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవత ఆలయంలో పోచమ్మతల్లి, నాగదేవత, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు.

త్వరలో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ

నవాబ్‌పేట, ఆగస్టు 8: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించి ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలకు త్వరలోనే పంపిణీ చేస్తామని హౌసింగ్ పీడీ భాస్కర్ అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని యన్మన్‌గండ్ల, రుద్రారంలోని డబుల్‌బెడ్రూం ఇండ్ల ఆవరణలో మండల అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం డబుల్ ఇండ్లను పరిశీలించారు. నవాబ్‌పేట, యన్మన్‌గండ్ల, తీగల్‌పల్లిలో డబుల్‌బెడ్రూం ఇండ్లను ఎమ్మెల్యేతో మాట్లాడి త్వరలోనే పంపిణీ చేసేందుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. పీడీ వెంట ఎంపీడీవో జయ రాంనాయక్, ఎంపీవో భద్రునాయక్ ఉన్నారు.

మొక్కలు నాటుతున్న హౌసింగ్ పీడీ భాస్కర్

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), ఆగస్టు 8 : కౌకుంట్ల మండలం తిర్మలాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భాస్కర్ తండ్రి కావలి పెద్ద బాలప్ప అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే ముచ్చింతలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ముచ్చింతల బీఆర్ఎస్ నాయకుడు కోట్ల శ్రీనివాస్‌రెడ్డి తల్లి మృతిచెందగా, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట కోట రాము తదితరులు ఉన్నారు